## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం



పరకాల : రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నట్లు ఏసీపీ శివరామయ్య తెలిపారు. కొద్దికాలంగా పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సీఐ, స్థానిక అధికారులతో ఏసీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలుగా పరకాల బస్టాండ్, మొగుళ్లపల్లి క్రాస్ రోడ్డు, వెల్లంపల్లి క్రాస్ రోడ్డు, భూపాలపల్లి రోడ్డు, తదితరాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో కోన్స్ ఏర్పాటు చేశారు. వాహనాదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ, సీఐ స్పష్టం చేశారు.

### సమస్యల పరిష్కారంలో చొరవ చూపండి



పరకాల : వీఆర్ఏల సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వీఆర్ఏల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. పట్టణంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. పీఆర్సీ, వేతనాల పెంపు, పదోన్నతులు, తదితరాలను తమ్మినేని వీరభద్రం దృష్టికి తీసుకెళ్లారు.

### ఎల్లమ్మ బోనాలు



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తులు ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. తొలుత గ్రామ శివారులో నిర్మించిన ఆలయంలో ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని దాత బాలబోయిన తిరుపతి అందించగా మంగళవారం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం ముదిరాజ్ కులస్తులు బోనాలు తయారు చేసి కుటుంబాలతో వెళ్లి అమ్మవారికి సమర్పించారు. బోనాల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ గండి మల్లికాంబ, ఎంపీటీసీ బీరం మౌనిక, ఉపసర్పంచ్ ఊట్ల ప్రతాప్, రమేష్ గౌడ్, దేవేందర్‌రెడ్డి, కులపెద్దలు లింగమూర్తి, రాజయ్య, రాజు, బాబు, వెంకటయ్య, సురేష్, మల్లేశం, నాగరాజు, నారాయణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన సొసైటీ డైరెక్టర్ బరిగెల చింత బాబును అతడి కొడుకు బరిగెల చింత అనిల్ (32) అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన క్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. తొలుత అనిల్ మృతదేహానికి రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మార్నేని మధుమతి, సర్పంచ్ జన్ను కుమారస్వామి, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, కావటి స్వామి తదితరులున్నారు.

### 'వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మోసం'

శాయంపేట : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ విమర్శించారు. ఈనెల 15న తలపెట్టిన హైదరాబాద్ దిగ్బంధం కోసం ఎమ్మార్పీస్ జిల్లా కన్వీనర్ గద్దెల సుకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర మండలంలోని మాందారిపేట నుంచి శాయంపేటకు మంగళవారం చేరుకోగా దినేష్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ఆమోదిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి మోసపూరిత వ్యాఖ్యలతో కాలం వెళ్లదీస్తోందని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, నాయకులు పాముల సుబ్బయ్య, శనిగరపు రవీందర్, ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ కోకన్వీనర్ కొట్టె కల్యాణ్, చిలుక రాజు, రాష్ట్ర నాయకులు మసకే సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మానవ పురోగతిలో సైన్స్ కీలకం




పరకాల : మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్

పరకాల : మానవ పురోగతిలో సైన్స్ కీలకమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ కళాశాల ఆవరణలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడగా సైన్స్ విభాగధిపతులు డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ వి.రాజయ్య, డాక్టర్ జి.ఓదేలు తదితరులు పాల్గొన్నారు. బాలికల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ హాజరై తిలకించగా ప్రధానోపాధ్యాయురాలు భైరి మాధవి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సీవీ.రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాల ప్రదర్శనను తిలకించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

దామెర : మండలంలోని ఓగ్లాపూర్ గ్రామ సమీపంలోని డిస్నీల్యాండ్ స్కూల్‌లో శాస్త్రవేత్త సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు 136 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన కాలె యశ్వంత్, మూడు మనోజ్, ఎలుకపెల్లి శ్రీమణి సీనియర్ విభాగంలో బహుమతులు అందుకోగా జూనియర్ విభాగంలో వినయ్‌వర్మ, పి.అర్జున్, పి.అఖిల్ బహుమతులు అందుకోగా ముఖ్యసలహాదారు దయ్యాల సదయ్య మాట్లాడారు. కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్ భాను, ధినేష్ చందర్, తదితరులు పాల్గొన్నారు. ల్యాదెళ్లలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ కిట్స్, స్టేషనరీ పంపిణీ చేయగా సొసైటీ ప్రతినిధి విద్యాసాగర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్, రాజేశ్వరి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు సర్పంచ్ శ్రావణ్య తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు సుమారు 100కుపైగా ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ బొలిమల్ల సంజీవ్, ఏఓ లక్ష్మారెడ్డి మాట్లాడగా ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు శ్రావణ్, రషీద్, రమేష్, నాగరాజు, మౌనిక, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ఆల్టిట్యూడ్ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ సుస్కూరి కార్తీక్‌రావు బహుమతులు అందజేసి మాట్లాడగా ప్రిన్సిపాల్ సుంకెనపల్లి ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిళి, ఉపాధ్యాయులు సుమలత, ఐశ్వర్య, తిరుపతి పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని స్ప్రెక్ట్రా కాన్సెప్ట్, సెయింట్ థెరిస్సా, తిరుమలగిరిలోని కేజీబీవీ, గూడెప్పాడ్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని జెడ్పీహెచ్ఎస్ వేలేరు, ఎర్రబెల్లి, పీచర, కన్నారం, మల్లికుదుర్ల, టీఎస్ఆర్ఈఐఎస్, కేజీబీవీలతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సైన్స్ క్విజ్, రంగోలి తదితర పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర సెకండరీ స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయులు అనిత, సురేఖ ఆధ్వర్యంలో సైన్స్ డే నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వేలేరు టీఎస్ఆర్‌జేసీలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆసనాల శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడగా టీఎస్ఆర్‌జేసీలో ప్రిన్సిపాల్ డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కేఎస్‌వీ.రాజగోపాల్, శారద, రాజమాణిక్యం, సంజీవ, ప్రదానోపాధ్యాయులు నాగకుమారి, మాధవి, సైన్స్ ఉపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్, సీను విద్యానంద్, వీరయ్య, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని పున్నేలు శివారులోని ఏకశిల ఈ-టెక్నో స్కూల్‌లో సీవీ.రామన్ చిత్రపటానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి పూలమాల వేసి సైన్స్ ఫేర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు 200కుపైగా ఎగ్జిబిట్లను తయారు చేయగా 40 ఉత్తమమైనవాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఎగ్జిబిట్లు తయారు చేయడంలో ప్రోత్సహించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి కిరణ్, ఏఓ బాబా, గుర్రం రమేష్, దేవేందర్, క్రిస్టీనా తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండలంలోని గట్లనర్సింగాపూర్, కొత్తకొండ తదితర గ్రామాల్లోని హైస్కూళ్లలో సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్విజ్ నిర్వహించారు. విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి, దయాకర్, సర్దార్, చారి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసమే 'కంటి వెలుగు'

- వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



శాయంపేట : కళ్లద్దాలు అందజేస్తున్న గండ్ర జ్యోతి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసమే కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని నేరేడుపల్లి, పత్తిపాక గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమస్యలున్న వారికి కళ్లద్దాలు అందించడంతోపాటు అవసరమైతే ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారని తెలిపారు. అనంతరం పలువురికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఆకులతోట రాజేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వైద్యాధికారి అఖిల్, ఉప సర్పంచ్ తుడుం సరోజన మల్లయ్య, వార్డు సభ్యులు రామరాజు, స్వామి,తదితరులు పాల్గొన్నారు.

**కంటి వెలుగును వినియోగించుకోండి**

పరకాల : 'కంటి వెలుగు' శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ కోరారు. పట్టణంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడగా వైస్‌చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామెర : కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల కోరారు. మండలంలోని కోగిల్వాయి గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరళ, సిబ్బంది సలోమి, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సారథ్యంలో అవినీతి రహిత పాలన

- బీజేపీ నియోజకవర్గ పాలక్ వెదిరే శ్రీరామ్



పరకాల : మాట్లాడుతున్న వెదిరె శ్రీరామ్

పరకాల : ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నట్టు బీజేపీ పరకాల నియోజకవర్గ పాలక్ వెదిరె శ్రీరామ్ తెలిపారు. పట్టణంలోని 46, 48, 50 బూత్‌ల పరిధిలోని శక్తి కేంద్రం ఇన్‌చార్జి కుక్కల విజయ్‌కుమార్ అధ్యక్షతన బీసీ కాలనీలో మంగళవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి శ్రీరామ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కరోనా సమయంలో దేశ ప్రజలందరికి ఉచితంగా వ్యాక్సిన్ అందించి ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత ప్రధాని సొంతమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించారు. సమావేశంలో బీజేపీ ఆలేరు పాలక్ మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**భూస్వాముల ప్రభుత్వం.. వారికే 'రైతుబంధు'**

ఎల్కతుర్తి : రాష్ట్రంలో భూస్వాముల ప్రభుత్వం పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద రైతులను విస్మరించి భూస్వాములకే రైతుబంధు సాయం అందజేస్తోందని ఆయన విమర్శించారు. మండలంలోని కేశవాపూర్ గ్రామంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిథిగా శివకుమార్ హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సీఎం విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు రాజు, కోటేశ్వర్, జనగాని కిష్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి యాత్రను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి : ఈనెల 1, 2 తేదీల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో తలపెట్టిన టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి జోడో యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కోరారు. మండలంలోని ముల్కనూర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు అక్కన్నపేట మండలంలోని కట్కూర్ క్రాస్ రోడ్డు వద్దకు రాత్రి 9 గంటలకు రేవంత్‌రెడ్డి యాత్ర చేరుకుంటుందని తెలిపారు. 2న ఉదయం 9 గంటలకు మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉదయం 10 గంటలకు గండిపల్లి ప్రాజెక్టును, 11 గంటలకు సైదాపూర్ మండలంలోని సర్వాయిపేటలోని సర్దార్ సర్వాయి పాపన్న కోటను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం కట్కూర్ నుంచి హుస్నాబాద్‌కు పాదయాత్ర చేరుకుంటుందని వివరించారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సభ ఉంటుందని తెలిపారు. కాగా మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన పోలు వీరస్వామి, పాతపెల్లి కుమారస్వామి, మారుపాక రాజు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## వైఎస్సార్‌టీపీ యూత్ మండల అధ్యక్షుడిగా అఖిల్




ఆత్మకూరు : వైఎస్సార్‌టీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన గురిజాల అఖిల్‌ను నియమిస్తూ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జన్నారపు మహేష్ మంగళవారం ఉత్తర్వులు అందచేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో అఖిల్ మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్మిస్తామని తెలిపారు. తనను నియమించినందుకు నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు.

## బీసీలకు టికెట్ ఇచ్చే పార్టీకే మద్దతు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్

పరకాల : పరకాల నియోజకవర్గంలో బీసీ అభ్యర్థికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే పార్టీకే మద్దతిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ తెలిపారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని బీసీలకు కాకుండా ఇతర సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే బీసీలంతా ఐక్యంగా బీసీ అభ్యర్థికి ఓటేసి గెలిపించుకోవాలని తెలిపారు. సమావేశంలో సంఘం వర్కింగ్ అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, బీసీ సంక్షేమం సంఘం అనుబంధ విద్యార్థి విభాగం అధ్యక్షుడు దేవరకొండ నరేష్ చారి, మహిళా విభాగం అధ్యక్షురాలు భీమగాని సౌజన్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాయిని భరత్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి : ఎస్సై



శాయంపేట : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఓ తెలుగు దినపత్రిక యాజమాన్యం ఆధ్వర్యంలో ఎస్సై చేతుల మీదుగా వాహనదారులకు మంగళవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. హెల్మెట్ వినియోగించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం వాహనదార్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు హెల్మెట్లు ధరించాలని కోరారు. కార్యక్రమంలో పత్రిక ఎడిటర్ దామెర రాజేందర్, విలేకరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తరగతులు బోధించి అలరించారు. హెచ్‌ఎంగా రాంచరణ్, ఎంఈఓగా పి.జశ్వంత్, డీఈఓగా హర్షవర్ధన్, పీఈటీగా బి.వరుణ్, ఉపాధ్యాయులుగా వైష్ణవి, సింధూజ, ప్రసన్న, అమూల్య, వర్షిత, అక్షయ, శివసాయి, వైదేహి, మనస్విని, రిషిక, సాహిత్య, ప్రవళిక, కావ్య, రుచిత, హర్షిణి, చైతన్య వ్యవహరించారు. అనంతరం ప్రదానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ పెసరు రమేష్ హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించి వారిలోని సృజనాత్మకతను బయటికి తీసేలా బోధించాలని సూచించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందం, విజయరాణి, హేమలత పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే 'చల్లా'పై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న సోదా రామకృష్ణ

పరకాల : అభివృద్ధి ప్రదాతగా గుర్తింపు పొందిన స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై కాంగ్రెస్ నాయకుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సోదా రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ఘనత చల్లా ధర్మారెడ్డిదైతే రేసుగుర్రాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న చరిత్ర వెంకట్రాంరెడ్డికి దక్కుతుందని చెప్పారు. ఎవరితో లాభం చేకూరుతుందో ప్రజలకు తెలుసన్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ కోసం ప్రభుత్వంపై ధర్మారెడ్డి ఒత్తిడి తీసుకొచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, కౌన్సిలర్లు శనిగరపు రజని, మార్క ఉమ, పాలకుర్తి గోపీ, ఏకు రాజు తదితరులు పాల్గొన్నారు.


# క్రికెట్ పోటీల్లో 'భీమదేవరపల్లి' జయకేతనం



భీమదేవరపల్లి జట్టుతో డీపీఓ, ఎంపీడీఓలు

భీమదేవరపల్లి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పంచాయతీ కార్యదర్శుల క్రికెట్ పోటీల్లో భీమదేవరపల్లి జట్టు జయకేతనం ఎగరేసింది. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పోటీలు నిర్వహించగా మూడు మ్యాచ్‌ల్లో రెండింటిని భీమదేవరపల్లి జట్టు గెల్చుకుంది. కాగా డీపీఓ జగదీశ్వర్ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు భాస్కర్, సునీత, ఎంపీఓలు నాగరాజు, రవి, కొత్తపల్లి సర్పంచ్ పొన్నాల హేమలత, పంచాయతీ కార్యదర్శులు జంగం పూర్ణచందర్, వీరన్న నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ' కందకంలో గేదె.. కాపాడిన రైతులు..



కందకంలో ఉన్న గేదె

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహ మూలమలుపు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడగా తీసిన కందకంలో ప్రమాదవశాత్తు గేదె పడగా గమనించి రైతులు దాన్ని కాపాడారు. అధికారులు మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతు చేయించి కందకాన్ని పూడ్చి వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# పౌర హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

పరకాల : మండలంలోని కామారెడ్డిపల్లిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి పోచారం ఎంపీటీసీ కోరె రమేష్ అధ్యక్షత వహించగా నాయబ్ తహసీల్దార్ సూర్యప్రకాశ్ మాట్లాడారు. పౌరులకు మౌళిక సదుపాయాల కల్పన కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ అన్నపూర్ణ, వీఆర్ఏ వోట్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఉపాధి, అభివృద్ధే లక్ష్యం

- జేఎస్ఎస్ డైరెక్టర్ ఖాజా మసీయొద్దీన్



శిక్షణ పూర్తి చేసిన మహిళలు

దామెర : మహిళల ఉపాధి, అభివృద్ధే లక్ష్యంగా జన శిక్షణ సంస్థాన్ (జేఎస్ఎస్) ముందుకు సాగుతోందని డైరెక్టర్ ఖాజా మసీయొద్దీన్ తెలిపారు. మండల కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కుట్టు, బ్యూటీ పార్లర్ శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద మహిళలకు కుట్టు, బ్యూటీ పార్లర్, తదితర అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మూడు నెలల ఉచిత శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడం ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి బాటలు వేస్తున్నట్టు చెప్పారు. త్వరలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళలు సంస్థ అందిస్తున్న శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి భూక్య తిరుపతి, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి.రాజు, సుజిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, రిసోర్స్‌పర్సన్లు సుకినె చంద్రకళ, సంధ్యారాణి, సువత పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే రైతు వేదికలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సువర్ణ, శ్రీనివాస్

ఐనవోలు : రైతుల సమస్యల పరిష్కారం కోసమే రైతు వేదికలు నెలకొల్పినట్టు ఏఈఓ డి.సువర్ణ తెలిపారు. మండలంలోని పంథిని క్లస్టర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ క్యాలెండర్‌ను రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, ఏఈఓ సువర్ణ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం సువర్ణ మాట్లాడారు. రైతు వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు ఏ సమయంలో ఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ క్యాలెండర్ సూచిస్తుందని చెప్పారు. ఆధునిక పద్ధతులను వినియోగించి పెట్టుబడి తగ్గించుకోవాలని చెప్పారు. జీవన ఎరువుల వినియోగాన్ని పెంచి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. వ్యవసాయ శాఖ సిఫార్సు మేరకు పంటలపై పురుగు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి సభ్యులు సీక బాబు, చాగంటి రాజు, బూస కుమారస్వామి, మేకల ప్రశాంత్, ఇజ్జగిరి గణేష్, జన్ను రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సెస్సీ ఇంటర్నల్ మార్కుల ధ్రువీకరణ పూర్తి



మార్కులను పరిశీలిస్తున్న వెరిఫికేషన్ టీమ్ సభ్యులు

ధర్మసాగర్ (వేలేరు) : ఎస్సెస్సీ విద్యార్థుల ఇంటర్నల్ మార్క్స్ ధ్రువీకరణ కార్యక్రమాన్ని సోమ, మంగళవారాల్లో పూర్తి చేసినట్లు మండల వెరిఫికేషన్ టీం సభ్యులు, ఎంఎన్ఓ మహేష్ నాయక్, మహిపాల్ పట్నాయక్, వీరయ్య తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని 8 ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలల్లో 302 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతుండగా వారి ఇంటర్నల్ మార్క్స్ ధ్రువీకరణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు.

# నాగుర్ల వెంకన్నకు అభినందన



నాగుర్ల వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

నడికూడ : ఆరే సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా రెండోసారి ఎన్నికైన సందర్భంగా మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లును ఆరే సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లోకాటి నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, వాంకె రాజు తదితరులు పాల్గొన్నారు.